నమస్తే తెలంగాణ
నల్లగొండ, ఆదివారం, 13 ఏప్రిల్ 2025
SUNDAY, APRIL 13, 2025

# ప్రారంభాలు సరే.. కొనుగోళ్లేవి?

- ఇప్పటికీ అలాట్ కాని మిల్లులు
- తెరుచుకోని ఆన్‌లైన్ సేవలు
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న ధాన్యం

మోత్కూరు, ఏప్రిల్ 11 : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోతున్నది. ఈ నెల ఒకటి నుంచి ధాన్యం కొనుగోళ్లు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ నెల రెండో తేదీ నుంచే సింగిల్‌విండో, ఐకేపీ, ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కేంద్రాలు ప్రారంభించి పది రోజులు అయినా నేటికీ కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. మోత్కూరు, గుండాల, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను తెరిచారు. కానీ.. కాంటాలు వేయడం లేదు. దాంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు వ్యాపారులకు అమ్ముకొని నష్టపోతున్నారు. మోత్కూరు మండలంలో రైతులు వరి కోతలు ప్రారంభించి 25 రోజులు కావస్తుంది. మోత్కూరు వ్యవసాయ మార్కెట్, ముశిపట్ల, దాచారం, పాటిమట్ల, సదర్శాపురం, ఆత్మకూరు(ఎం) మండలంలోని పల్లెర్ల, లింగరాజుపల్లి, అడ్డగూడూరు మండలంలో అడ్డగూడూరు, చిర్రగూడూరు, లక్ష్మీదేవికాల్వ, ధర్మారం, కంచనపల్లి, చౌళ్లరామారం, మానాయికుంట, డి.రేపాక, గుండాల, వస్తాకొండూరు, అంబాల, పెద్దపడిశాల, వెల్మజాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మిగతా గ్రామాల్లో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం మద్దతు ధర ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2,320 చెల్లిస్తుండగా, మోత్కూరు వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఆయా గ్రామాల్లో వేబ్రిడ్జిల ద్వారా కొనుగోళ్లు చేస్తున్న 17 మంది వ్యాపారులు సిండికేట్‌గా మారి రూ.1700 నుంచి 1,730 వరకు చెల్లిస్తున్నారు. దాంతోపాటు తూకంలోనూ మోసాలకు పాల్పడుతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు పేర్కొంటున్నారు.

### కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం

ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదీ నుంచి ధాన్యం కొంటామని ప్రకటించడంతో రైతులు వ్యవసాయ మార్కెట్‌లో, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం రాశులు పోశారు. కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో మార్కెట్‌లో పోసిన ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. దాంతో కొనుగోలు కేంద్రాల్లో స్థలం లేక రైతులు అవస్థలు పడుతున్నారు. మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో ఇప్పటికే సుమారు 15వేల బస్తాల ధాన్యం ఉంది. మార్కెట్‌లో పోయడానికి స్థలం లేదని కొందరు రైతులు వరి కోతలను ఆపుకొని ఎదురు చూస్తున్నారు.


మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో పేరుకు పోయిన ధాన్యం రాశులు (ఫైల్)

### అలాట్ కాని మిల్లులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచారు. కానీ.. కొనుగోలు చేసిన ధాన్యాన్ని పంపడానికి జిల్లా ఉన్నతాధికారులు మిల్లులను అలాట్ చేయలేదు. ఖరీదు చేసిన ధాన్యం, రైతుల వివరాలను నమోదు చేయడానికి ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకురాలేదు. దీంతో ధాన్యం కొనుగోలు చేయడం లేదని కేంద్రాల నిర్వాహకులు చెబుతున్నారు.

### ఆందోళనలో రైతులు

అక్కడక్కడ అకాల వర్షం, వడగండ్లు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆకాశంలో మబ్బులు చూసి ధాన్యం రాశులు పోసినవారు, వరి కోతలు పూర్తికాని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. క్వింటా వడ్లు రూ.1720కే విక్రయించి నష్టపోతున్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

### ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నా..

మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినా ఇప్పటి వరకూ బస్తా ధాన్యం తూకం చేయలేదు. ఇప్పటికే ధాన్యంతో మార్కెట్ నిండింది. రోజుకో తీరు మబ్బులు కమ్ముకొస్తున్నాయి. చేసేదేమీ లేక ప్రైవేట్ వ్యాపారికి రూ.1730కి క్వింటా చొప్పున అమ్ముకున్నా. 48 క్వింటాళ్ల ధాన్యానికి రూ.78వేలు మాత్రమే వచ్చాయి. రూ.30వేల వరకు నష్టపోయాను.



– చిట్టిమాల దేవయ్య, రైతు, మోత్కూరు

### మిల్లుల అలాట్‌మెంట్ కాలేదు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 2న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాం. కొనుగోలు చేసిన ధాన్యాన్ని పంపడానికి జిల్లా అధికారులు ఇంకా మిల్లు అలాట్‌మెంట్ చేయలేదు. రైతుల వివరాలను పొందుపర్చడం కోసం ఆన్‌లైన్ విధానం కూడా ఓపెన్ చేయలేదు. మిల్లు అలాట్‌మెంట్ రాగానే ట్యాబ్ ఓపెన్ చేసిన వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేస్తాం.

– కొణతం వరలక్ష్మి, మోత్కూరు ఎఫ్‌ఎస్‌సీఎస్ సీఈఓ

## గుట్టలో వైభవంగా తెప్పోత్సవం


యాదగిరిగుట్ట కొండపైన విష్ణుపుష్కరిణిలో విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 12 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవం కన్నుల పండువగా సాగింది. చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా శనివారం స్వామి వారు లక్ష్మీసమేతంగా తెప్పపై నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, డీఈఓ దోర్బాల భాస్కర్‌శర్మ, అర్చకులు పాల్గొన్నారు.


రాజాపేటలో రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి

## రజతోత్సవ సభకు బీఆర్‌ఎస్ శ్రేణులు తరలి రావాలి

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

రాజాపేట, ఏప్రిల్ 12 : బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మండల సెక్రెటరీ భాస్కర్ గౌడ్, గుంటి మధుసూదన్‌రెడ్డి, ఠాగూర్ ప్రమోద్ సింగ్, ఎర్ర గోకుల జశ్వంత్, గోపగాని యాదగిరి గౌడ్, బెడిదే వీరేశం, కట్కం స్వామి, ఎమ్మా భాస్కర్ గొల్లూరి శ్రీకాంత్, షాగర్ల పరమేష్, గోపగాని శ్రీనాథ్, గంధమళ్ల సురేశ్, అబ్దుల్, అబీద్ పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌వీ పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

యాదగిరిగుట్ట : బీఆర్‌ఎస్ పార్టీ 25వ వసంతోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్‌వీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన రాయగిరి నుంచి యాదగిరిగుట్ట స్వామివారి పాదాల వరకు పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్లు దేవరపల్లి ప్రవీణ్‌రెడ్డి, ఒగ్గు శివకుమార్ తెలిపారు. శనివారం మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పాదయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆమె నివాసంలో ఆవిష్కరించారు.

పాదయాత్ర ప్రారంభానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు, జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ కన్వీనర్ ర్యాకల రమేశ్, నాయకులు బెజ్జరబోయిన మహేశ్, పచ్చిమట్ల వంశీ, కంకల మహేశ్, ఏర్పుల అరవింద్, గడ్డం సతీశ్, మున్నా, అకిరెడ్డి శ్రవణ్, పవన్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగంగా చేపట్టాలి : మాధవరెడ్డి


మాధవరెడ్డి

రామన్నపేట, ఏప్రిల్ 12 : రైతులు ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, రైతు సమన్వయ సమితి మాజీ మండలాధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకొచ్చి వారం, పది రోజులైనా నేటికీ కాంటా చేయక పోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయిందన్నారు. అధికారులు వెంటనే స్పదించి రైతులకు ఇబ్బంది కలుగకుండా బస్తాలు అందించి కాంటా వేగవంతంగా వేయాలని కోరారు.


సైకిల్ యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

## యువ చైతన్య సైకిల్ యాత్రను జయప్రదం చేయాలి : వెంకటేశ్

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 12 : జిల్లా వ్యాప్తంగా ఈనెల 14 నుంచి 20 వరకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 'డ్రగ్స్ గంజాయి వద్దు– ఆరోగ్యం ముద్దు, ఆన్‌లైన్ బెట్టింగ్ వద్దు' అనే నినాదంతో 60 గ్రామాల్లో వారం రోజులు పాటు 350 కిలోమీటర్లు నిర్వహించే యువ చైతన్య సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్ కోరారు. పట్టణ కేంద్రంలో శనివారం సైకిల్ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. యాదాద్రి జిల్లాలో యథేచ్ఛగా డ్రగ్స్, గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగులు విపరీతంగా సాగుతున్నాయన, 17 నుంచి 40 ఏండ్ల లోపు యువత వీరికి బానిసలుగా మారి బంగారరు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామాల్లో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేక, ప్రభుత్వ ప్రోత్సాహం కరువై కుటుంబాలు గడవక మత్తుకు అలవాటు పడుతున్నారన్నారు. డ్రగ్స్ నివారణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మంచాల మధు, దుబ్బాక జగన్, పెండెం రాజు, చుక్క రజనీకాంత్, ఎర్రవల్ల సాయి, వంగూరి అనిల్ పాల్గొన్నారు.

## ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కట్టంగూర్, ఏప్రిల్ 12 : ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఎరసానిగూడెం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకొంది. ఎస్ఐ మునుగోటి రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యాపాల సంపత్‌కుమార్ రెడ్డి(24) తండ్రి 2007లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.

అప్పటి నుంచి తల్లి లక్ష్మమ్మతో కలిసి నార్కట్‌పల్లిలో ఉంటూ ఎంసీఏ చదువుకున్నాడు. ఉన్నత చదువుల కోసం యూఎస్ఏకు వెళ్లేందుకు ప్రయత్నించినా వీలు కాకపోవడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఉద్యోగ అవకాశాలు రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం సాయంత్రం స్వగ్రామమైన ఎరసానిగూడెం వెళ్లి ఇంటి పైకప్పు ఇనుప రాడ్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. శనివారం మృతుడి అన్న వెంకటరమణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


మోటకొండూరు : దిలావార్‌పూర్‌లో ఉపాధి హామీల కూలీలతో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్

## ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి : సీపీఐ

మోటకొండూర్, ఏప్రిల్ 12 : ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ అన్నారు. మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలోని ఉపాధి హామీ కూలీల సమస్యలను శనివారం ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు రూ.400 వేతనం ఇవ్వాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ప్రతి కూలీకి రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు నమిలే ఎల్లమ్మ, పార్వతమ్మ, భిక్షపతి, రంగయ్య, నరేందర్, లక్ష్మి, ప్రమీళ, మహేశ్వరి ఉన్నారు.

భూదాన్‌పోచంపల్లి : ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు మంచాల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మెహర్‌నగర్ గ్రామంలో శనివారం కూలీల పని ప్రదేశానికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దుబ్బాక జగన్, అశోక్, రమేశ్ పాల్గొన్నారు.


యాదగిరిగుట్టలో బీటీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

## రహదారులను ఆధునీకరిస్తాం : ప్రభుత్వ విప్ బీర్ల

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 12 : పూర్తిగా ధ్వంసమైన బీటీ, సీసీ రోడ్లను ఆధునీకరిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి చౌరస్తాలో బీటీ, సీసీ రోడ్ల పనులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వారం రోజుల్లో యాదగిరిపల్లి, గాంధీనగర్ ప్రాంతాల్లో రోడ్లన్నీ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీస విజయలక్ష్మీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని పాముకుంట, సింగారం, మల్లె గూడెం గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రారంభించారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం


స్నేహితుడి కుటుంబానికి బియ్యం అందిస్తున్న సంస్థ సభ్యులు

ఆలేరు టౌన్, ఏప్రిల్ 11 : పట్టణంలోని సిల్క్‌నగర్ కాలనీకి చెందిన కొత్తోజు శ్రీధర్‌చారి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో తోటి స్నేహితులు స్పందించి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో 50కేజీల బియ్యాన్ని శనివారం కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పేరపు ఆనంద్, చైర్మన్ మైదాం భాస్కర్, కన్వీనర్ కుంతావత్ కమలాకర్, జూకంటి సిద్దులు, సంపత్, సురేశ్, హరీశ్, కృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.


## సంక్షేమ బోర్డు పరిరక్షణకు ఉద్యమించాలి : ఏఐటీయూసీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 12 : ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నారని వాటిని తిప్పి కొట్టేందుకు కార్మికులందరూ కలిసి ఉద్యమించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరెటి రాములు, ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం మండల మహాసభ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5లక్షలు, యాభై ఎండ్లు నిండిన ప్రతి కార్మికుడికి ప్రతి నెలా రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కురిమిద్దె శ్రీను, బచ్చనగోని గాలయ్య, దుబ్బాక భాస్కర్, చిలువేరు అంజయ్య, పిల్లి శంకర్, లక్ష్మయ్య, కలకొండ సంజీవ, మల్లారెడ్డి పాల్గొన్నారు.

## 'గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి'


ఆత్మకూరు(ఎం) : కోరటికల్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులు

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 12 : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీకళ, విజయకుమారి అన్నారు. మండలంలోని కోరటికల్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణ పక్షం కార్యక్రమంలో వారు చిరుధాన్యాలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు మీనా, ఆశ కార్యకర్తలు నవ్యశ్రీ, హేమలత, శశిరేఖ పాల్గొన్నారు.

## పెట్రో ధరలు తగ్గించాలి : సీపీఎం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 12 : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ మండలంలోని కూరెళ్లలో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, యాదయ్య, మల్లయ్య, రాజమల్లు, సత్తయ్య, నర్సయ్య, యాదమ్మ, లక్ష్మి, సునీత, అండాలు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : వంట గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరిపాండు ఆధ్వర్యంలో మండలంలోని జలాల్‌పూర్, మర్యాల గ్రామాల్లో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, నాయకులు జంగయ్య, రాములు, అయిలయ్య, బాలరాజు, యాదమ్మ, మల్లయ్య, కృష్ణవేణి, లావణ్య, బ్రహ్మాచారి, సత్యనారాయణ, యాదగిరి పాల్గొన్నారు.


బొమ్మలరామారం : మర్యాల గ్రామంలో గ్యాస్ ధర పెంపును నిరసిస్తున్న సీపీఎం శ్రేణులు


పాల రైతుల రాష్ట్ర సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

## పాడి రైతుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి : బాలరాజు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 12 : ఏప్రిల్ 24న ఆలేరులో జరిగే పాడి రైతుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర సదస్సు కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలు పాడి పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతోందని, మదర్ డెయిరీ, విజయ, కరీంనగర్, ముల్కనూరు డెయిరీతో పాటు ప్రైవేటు సంస్థలు అతి తక్కువ రేట్లకు పాలు సేకరించి రైతులకు నష్టం కలిగిస్తున్నారన్నారు. పశువుల దాణా ధర పెరిగి పశుపోషణ కష్టంగా మారిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మదర్ డెయిరీ ప్రతి 15 రోజులకోసారి బిల్లులు చెల్లించాల్సి ఉండగా 2, 3 నెలలుగా చెల్లించడం లేదన్నారు. సమస్యలపై నిర్వహించే రాష్ట్ర సదస్సులో పాడి రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.జహంగీర్, మంగ నర్సింహులు, జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, నాయకులు దయ్యాల నర్సింహ, పండాల మైసయ్య, ఎస్‌కె.గోరెమియా పాల్గొన్నారు.


వనజీవి రామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సామాజిక ఉద్యమ నాయకులు

## వనజీవి రామయ్య మృతి పర్యావరణ పరిరక్షణకు తీరని లోటు

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 12 : వనజీవి రామయ్య మృతి పర్యావరణ పరిరక్షణకు తీరని లోటు అని సామాజిక ఉద్యమ నాయకుడు నల్ల చంద్రస్వామి అన్నారు. మండల కేంద్రంలో శనివారం రామయ్య చిత్రపటానికి ఆయన నివాళులర్పించి మాట్లాడారు. కోటికి పైగా మొక్కలు నాటి పర్యావరణానికి నిలువెత్తు రూపమైన పద్మశ్రీ రామయ్య మృతి బాధకరమన్నారు. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా రహదారుల వెంట, కనిపించిన ప్రతిచోటా మొక్కలు నాటడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం, మధుసూదన్‌రెడ్డి, నగేశ్, పద్మారెడ్డి, శ్రీధర్, సత్తయ్య, నర్సింహ పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు : మల్లేశ్‌గౌడ్


కొల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ మల్లేశ్‌గౌడ్

ఆలేరు రూరల్, ఏప్రిల్ 12 : రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పీఏసీఎస్ చైర్మన్ మొగులగాని మల్లేశ్‌గౌడ్ అన్నారు. మండలంలోని కొల్లూరు గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ధాన్యాన్ని సజావుగా కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. పీఏసీఎస్ డైరెక్టర్లు గవ్వల నర్సింహులు, ఆరె మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## ధ్యానం ఆరోగ్యానికి శక్తివంతమైన సాధనం : ప్రభాకర్

బీబీనగర్, ఏప్రిల్ 12 : ధ్యానం ఆరోగ్యానికి శక్తివంతమైన సాధనమని హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ వలంటీర్ ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలోని కేకేజీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో శనివారం ఉచిత ధ్యాన శిక్షణ సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ధ్యాన సాధన అలవర్చుకోవాలని, ధ్యానం ఒక దివ్యమైన సాధనమని ఆరోగ్యానికి అది ఒక గొప్ప వరమన్నారు. కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్, ధనుంజయ, గౌతమ్ శర్మ, దుర్గా కుమార్, వెంకటేశ్‌బాబు, నరసింహాచారి పాల్గొన్నారు.

## 'దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

భువనగిరికలెక్టరేట్, ఏప్రిల్ 12 : దాతలు అందించే సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రోటరీక్లబ్ సభ్యులు అన్నారు. క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ ఆధ్వర్యంలో మండలంలోని అనంతారం మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కూల్‌కు శనివారం రూ.25,000 విలువైన 50 ప్లాస్టిక్ కుర్చీలు పాఠశాల గ్రంథాలయానికి అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎండీ హనీఫ్ మేమన్, మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, గడ్డం జ్ఞానప్రకాశ్‌రెడ్డి, క్లబ్ డైరెక్టర్ కపిల్, యాదగిరి, రెసిడెన్సియల్ పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువతి ఆత్మహత్య


భార్గవి (ఫైల్)

రామన్నపేట, ఏప్రిల్ 12 : మండలంలోని బోగారం గ్రామంలో శనివారం సాయంత్రం యువతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కూనూరు సుదర్శన్– లక్ష్మీ ఏకైక కుమార్తె భార్గవి (22) డిగ్రీ పూర్తి చేసుకొని ఇంటి వద్దే ఉంటున్నది. గత పదినెలల క్రితం తండ్రి సుదర్శన్ మృతి చెందగా తల్లి టైలరింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. శనివారం తల్లి ఇంట్లో లేని సమయం చూసి భార్గవి దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

### బీఆర్‌ఎస్ బహిరంగసభను విజయవంతం చేయాలి : నర్సింహ

భువనగిరికలెక్టరేట్, ఏప్రిల్ 12 : బీఆర్‌ఎస్ పార్టీ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ పెంచికల్ పహాడ్ గ్రామశాఖ అధ్యక్షుడు గోపె నర్సింహ శనివారం ఒక ప్రకటనలో కోరారు. బహిరంగ సభకు గ్రామం నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, పార్టీ అభిమానులు స్వచ్ఛందంగా తరలి రావాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రధాని దిష్టిబొమ్మ దహనం

చౌటుప్పల్, ఏప్రిల్ 12 : మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల 65వ జాతీయ రహదారిపై ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలకు నిరసనగా దిష్టి బొమ్మ దహనం చేసినట్లు వారు తెలిపారు. పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎర్రగోని నవీన్ యాదవ్, పోతగోని శివగౌడ్, బోయ నవీన్, డాకోజి అజయ్, భాస్కర్, ముజాహిద్, శ్రీధర్ పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి సహకరించాలి : ప్రదీప్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 12 : పాఠశాల అభివృద్ధికి అందరూ సహకరించాలని నాయకులు గోరంటి ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండలంలోని జలాల్‌పూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలకు జాంభవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ ఐటమ్, వాటర్ ట్యాంక్ సెంటెక్స్‌ను శనివారం అందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శాపాక భిక్షపతి, నాయకులు శాపాక శంకర్, శాపాక స్వామి, జంగయ్య, మహంకాళి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసమే ఐఎఫ్‌టీయూ పోరాటం

ఆలేరు టౌన్, ఏప్రిల్ 12 : కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసమే ఐఎఫ్‌టీయూ పోరాటం చేస్తుందని సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు బి. ప్రదీప్ అన్నారు. పట్టణ కేంద్రంలోని గౌడ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఇఫ్టూ రాజకీయ శిక్షణ తరగతుల్లో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధానకార్యదర్శి ఎం. శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. జనార్దన్, అరుణక్క, అనురాధ, భూమయ్య, సీతారామయ్య, నాగయ్య, శ్రీధర్, సూర్య శివాజీ, గీత, హరిత, భారతి, సీత, దాసు పాల్గొన్నారు.